
# కోరుకున్న ఛానెలు

-ఎలక్ట్రాన్



దిన చర్య అనేది మనిషి కొకనికే పరిమితం కాదు. అనంతమైన విశ్వాంతరాళంలో నక్షత్ర మండలాల దగ్గరినుంచి పరమాణువులో పరిభ్రమించే ఎలక్ట్రాన్ల వరకు గతి తప్పని చర్య ఉండనే ఉంది. విసుగనేది లేకుండా యుగ యుగాలుగా బ్రహ్మాండం తన ధర్మాన్ని నిర్వహిస్తూంది. చాలా పరిమితమైన జీవన ప్రమాణంగల మనిషి మాత్రం కాల యంత్రంలో జరిగే దిన చర్య అంటేమాత్రం మహా విరాకు పడిపోతాడు. అందుకనే మనిషి విసుగుని విరగకొట్టడానికి మార్గాలు అన్వేషించసాగాడు. ఇంట ఎవరైనా పుట్టినప్పుడు గొల్లుమనవ్వడం దగ్గర్నించి చచ్చినప్పుడు గొల్లున ఏడ్వడందాకా, కాలి నడకనుంచి విమానప్రయాణాల దాకా, నిప్పు పుట్టించడం మొదలు ఖగోళ రహస్యాలు తెలుసుకోవడం దాకా, కొండగుహల్లో దాక్కోవడం దగ్గరినుంచి ఆకాశ హర్మ్యాలలో నివసించడం దాక మార్పుకోసం ఆశించే మనిషి కల్పించుకున్నవీ, సాధించగలిగినవీ. అయితే ఇవన్నీ కూడా మళ్ళీ దినచర్యలలో భాగంగా మారడంతో మళ్ళీ అదే విసుగు.

మనిషి మనసు ఆనందంగా ఉండడం సంభవించేది విసుగెత్తే ఈ దినచర్యనుంచి వీలయినంత మట్టుకు తప్పించుకున్నప్పుడే. నాగరికత అభివృద్ధి చెందడంతో అవసరాలు పెరిగాయి. అవసరాలు పెరగడంతో ఉపయోగపడే యంత్రాలుగా కావలసి వచ్చింది. అందుకనే ఆఫీసులనేవి పుట్టుకొచ్చాయి. ఇవి మనిషికి జీవనోపాధిగా మారాయి. ఒక్కొక్క ఆఫీసు ప్రజల కొన్ని అవసరాలు తీర్చడంకోసం రూపొందించబడింది. ఆఫీసు కుర్చీలో కూర్చున్న వాడికి ప్రతి రోజూ అదే కుర్చీలో కూర్చుని, అదే పని చెయ్యడం అంటే విసుగు. అందుకనే ఎయిటు క్యాలో ఉన్నవాళ్ళు ఇద్దరి పనులు చూసిన తర్వాత మధ్యాహ్నపు వాడి పని చేసే సమయంలో పక్క వాడితో పది నిమిషాలు బాతాఖానీ, లేదా క్యాంటీన్‌కి పోయి అరగంట తర్వాత రావడం అలవాటయింది. మరి అలా చేస్తే నేకాని పని ముందుకు జరగదు.

అందుకనే కళలని సృష్టించుకున్నాడు మనిషి. మనిషిలో రసోత్పాదన కలిగించి, తుప్పు పట్టిన హృదయానికి ఉల్లాసం కలిగించడం కోసం చిత్రాల్నీ, గానాన్నీ, నృత్యాన్నీ కల్పన చేశాడు. కాలం ముందుకు జరుగుతున్నకొద్దీ వీటిలో కూడా విపరీతమైన మార్పులు సంభవించాయి. ఒకదానితో మరొకటి మేళవించడం జరిగింది. తోలుబొమ్మలాటలూ, నాటకాలూ, చలన చిత్రాలూ తన ఆనందంకోసం మనిషి శ్రమించి రూపొందించాడు.

రేడియో తరంగాల్ని తెలుసుకున్న మనిషి ధ్వని ద్వారా ప్రపంచాన్ని దగ్గరగా తీసుకు వచ్చాడు. వార్తా ప్రసార సాధనంగా ఉపయోగించే రేడియో ఒక ప్రాంతంలో జరిగే సంఘటనలు మరో ప్రాంతానికి వినిపించడమేకాకుండా, ఒక ప్రాంతపు గానాన్నీ, సంగీతాన్నీ మరొక ప్రాంతానికి వినిపిస్తుంది. ఒక గాయకుణ్ణీ, గాయకురాల్నీ, ఒక వాద్యగాణ్ణీ ప్రజలకి పరిచయం చేస్తుంది. ఇంత ప్రచార సంచలనం కలిగించిన రేడియో,





కూడా మన ప్రయాణసాధనాల్లో ఒకటిగా మారి పోవడంతో మళ్ళీ అదే పెరుగు.


ఎక్కడో దేశ మధ్యంలో నివసిస్తున్న వాడికి సముద్రం ఎలా ఉంటుందో తెలియదు. సముద్ర తీరంలో నివసిస్తున్న వాడికి హిమాలయాలు ఎలా ఉంటాయో తెలియదు. కోనసీమనుంచి కాలు కదపని వాడికి రైలుబండి ఎలా ఉంటుందో తెలియదు. చలన చిత్రాలు ఈ కష్టాన్ని ఒక్క దెబ్బతో తీసిపారేశాయి.

మనిషికి ఆనందాన్ని కలిగించే సాధనంగా చలన చిత్రమనేది యావత్ప్రపంచాన్నీ చుట్టబెట్టేసింది. మారుతున్న వ్యవస్థలో మనిషి చేస్తున్న ప్రతి పనికీ వెనక వ్యాపార దృష్టి అనేది ఒకటి ఉంటుంది. అందుకనే అన్ని కథల్నీ మసాలాల్లో రంగరించి, అన్ని దేశాల ప్రదేశాల్నీ ఒకచోట కుదించి మరికొన్ని అభూత కల్పనలు కల్పించి, రూపొందించిన ఈ చలన చిత్రం జనంమీద విష్ణుమాయలాంటి పొర కమ్మేసింది.

సాయంత్రం అయిదూ పదికి రావలసిన సిటీ బస్ అయిదున్నరయినా రాకపోయేసరికి బస్ స్టాండ్‌లో నిలుచుని, ఎదురుగా ఉన్న సినిమా హాలు మీద అంటించిన పెద్ద సినిమా ప్రకటన చూస్తున్న నాలో ఈ ఆలోచనలు చెలరేగాయి. సాయంకాలం ఆటకోసమని బుకింగ్ అప్పుడే తెరవడంతో టికెట్ల కోసం జనం కుమ్ములాడుకుంటున్నారు. మాటినీ అయిందనుకుంటాను— హాల్లోనుంచి జనం బయటికి వస్తున్నారు. పుస్తకాలు చేత బట్టుకుని బయటకు వస్తున్న అబ్బాయిలూ, అమ్మాయిలూ [illegible], కాలేజీలు ఎగవేసిన బాపతని తెలుస్తూనే ఉంది. అందుకు నేను ఆశ్చర్యపోలేను. మధ్యాహ్నం ఇంట్లో ఏదో పనుందని చెప్పి సెలవు తీసుకుపోయిన అనంతం దొంగ చూపులు చూసుకుంటూ, బస్ స్టాండులో నిలుచున్న నన్ను చూసి, మరోవైపుగా పోవడం చూసి నవ్వుకున్నాను. అయితే అతగాడు చూడవలసిన రెండు అర్జెంటు కేసులు ఆఫీసరు నా నెత్తిమీద రుద్దినందుకు ఆ పని చేస్తున్నప్పుడు తోటి మనిషికి అవసరమున్నప్పుడు సహాయం చేస్తున్నాం కదా అనే ఉద్దేశంతో నేను చేసినా, సినిమాహాలోనుంచి బయటికి వస్తున్న అతగాణ్ణి చూసే చచ్చేటంత కోపం ముంచుకొచ్చింది. అప్పుడే బస్ కూడా రావడంతో కోపాన్ని దిగమింగుకుని బస్ లోపల దూరబడి ముందు కంటబడ్డ సీట్లో కూలబడ్డాను.

నాలాంటి మధ్యతరగతి వాడి జీవితంలాగే అయిన చోటా, కాని చోటా ఆగుతూ బస్సు నేను దిగవలసిన స్టాప్ చేరింది. దిగి ఇంటికి నేరుగా పోయాను. కూర్చుని పత్రిక చదువుకుంటున్న శ్రీమతి నన్ను చూడ్డంతో లేచి లోపలికి పోయింది, కాఫీ తీసుకు రావడానికి. చెమటతో తడిసి ముద్దయిన చొక్కాని విప్పి, వరాండా మెట్లమీద కూలబడ్డాను. కాలరంతా మురికిగా ఉన్న చొక్కాని వరాండాలోకి ఒక మూలగా గిరాటు వేశాను.

"ఎవరిమీద కోపం?" అంటూ కాఫీ గ్లాసుతో వచ్చింది శ్రీమతి.



ఎండలో... చిత్రం—కె. కుమార్

"నీవీమీద కాదు; మాసిన చొక్కామీద. ఒక్క నిమిషం ఆగు. వెధవ బనియను—చెమటతో ఒంటికి అంటుకుపోయింది. దీన్ని విప్పి పారేస్తేనే కాని కాఫీ తాగలేను" అంటూ బనియను విప్పాను. విప్పుతూంటే అది పర్రున చిరిగి వూరుకుంది. "బనియన్లన్నీ చిరిగిపోయాయి. రెండు, మూడు కొత్త బనియన్లు కొనుక్కుంటేనే కాని లాభం లేదు" అంటూ చిరిగిపోయిన బనియన్ని ఉండ చుట్టి మల్లెపాదుమీదికి విసిరేసి కాఫీ గ్లాసందుకున్నాను.

"మీ బనియన్ల సంగతి మీకేగాని, నా జాకెట్ల సంగతి మీ కక్కర్లేదు. వెధవ్వి అన్నీ చెత్తగా తగలడ్డాయి" అని గొణిగింది పక్కను కూర్చుని, మళ్ళీ పత్రిక అందుకుంటూ.

మల్లెపాదుకి గొప్పులు తవ్వుతున్న మా కుర్రాడు శ్రీనూ, అమ్మాయి లతా పాదుమీద బనియను పడ్డ చప్పుడు విని, చేస్తున్న పని మాని, మా దగ్గరగా వచ్చారు. పదవ క్లాసు చదువుతున్న శ్రీను నాకేసి అదోలా చూసి, "బనియను ఎందుకు విసిరేశారు?" అని ప్రశ్నించాడు.

"చిరిగిపోయింది. ఎందుకూ పనికిరాదు. అందుకని" అన్నాను.

"నా పి. టి. షూస్ పాడైపోయాయి. వాటిని కూడా అక్కడే పారేస్తాను" అన్నాడు వాడు.

"నా స్కూల్ బాగ్ చిరిగిపోయింది. దాన్ని పందిరికి తగిలిస్తాను" అంది ఆరవ క్లాసు చదువుతున్న లత.

"మరి నువ్వో?" అన్నాను శ్రీమతి కేసి చూస్తూ.

"నేను పారెయ్యదలచినవి అక్కడ విసరలేనని మీకు ఎలాగూ తెలుసు. మల్లెపాదు మీద మీరు చిరిగిన బనియను విసిరినందుకు కాదు వాళ్ళ కోపం. వాళ్ళ మాటల్లో అర్థం తెలుసుకోవాలి మీరు" అంది.

"కొత్త పి. టి. షూస్, కొత్త బాగ్ కావాలి—అంతేనా?"

"కాకపోతే మరేమిటి?" అంది.

"సరే. దానికేంలే. అలానే కొందాం. రేపెలాగూ సెలవేకదా? రేపు ఉదయం బజారుకి పోయి వాళ్ళకి కావలసినవీ, ఓటీ, రెండు బనియన్లూ కొనుక్కుని వద్దాం" అన్నాను, బీరువాలో బట్టలకింద ఆమరాలకి పనికొస్తాయని జాగ్రత్తగా ఉంచిన నోట్ల రూపాయలు దృష్టిలో ఉంచుకుని.

"బోరు కొట్టేస్తూంది. అస్తమానూ ఇల్లూ, నౌకిరీ, చాకిరీ తప్ప మరొకటి లేదు." హఠాత్తుగా మా ఆవిడ సంభాషణ మార్చింది.

"జీవితం అంటే బోరే మరి. చేసిన పనే చేస్తూ నాకూ విసుగెత్తిపోతూంది ఆఫీసులో. కాని, సంపాదిస్తున్న నాలుగు రాళ్ళూ వ్యయంగా సంపాదించాలన్న తాపత్రయంతో చాకిరీ చెయ్యక తప్పటంలేదు."

"అంటే, మీచేత మెడలో తాళి కట్టించుకొన్నందుకు గానుగెద్దులా పని చెయ్యడం నా ధర్మం అని నీతులు బోధిస్తున్నారు. అంతేనా?"

"ఒరేయ్, శ్రీనూ! కోడి గుడ్డుకి వెంట్రుకలు పూడదీయడం అనే సామెత నువ్వు వినే ఉంటావు. ఇప్పుడు మీ అమ్మ అన్న మాటలు ఆ సామెతను రుజువు చేస్తాయి. మీ కిద్దరికీ చదువంటే విసుగెత్తుతూందనుకుంటాను. మానేస్తారా?"

"ఏదో అన్న మాటని ఎక్కడికో లాక్కుపోతున్నారు. వాళ్ళకి ఇలా పాఠాలు చెప్పండి—స్కూళ్ళు మానేసి గాడిదల్లా తయారవుతారు" అంది.

మా ఆవిడ కున్న లక్షణాల్లో నాకు నచ్చేది ఇదొకటి. పిల్లల చదువు గురించి తెగ తాపత్రయ పడిపోతుంది.

"అందుకేనోయ్ రేపు షాపింగంటున్నాను. అందరమూ కలిసి పోదాం" అన్నాను.

"మరీ తక్కువ డబ్బు చేతిలో పెట్టుకుని షాపింగుకి వెళ్ళితే బాగుండదు. అందుకని...." మాట ఆపేసింది. నాకేదో అనుమానం వేసింది.

"అందుకని..." ఆత్రంగా అడిగాను.

" దీపాలిలో మంచి సినిమా వచ్చింది. రేపు మధ్యాహ్నం ఆటకి మనకక్కడా టికెట్లు రిజర్వు చేయించాను—పక్క ఇంటి పని కుర్రాణ్ణి వాళ్ళు పంపిస్తూంటే."

"బాల్కనీకేనా?"

"బాల్కనీకే. నాకు తెలియదా ఏమిటి?" పిండికొద్దీ రొట్టె అన్నట్టుగా మేము సినిమాలకి మొదటి తరగతికి వెళ్ళేవాళ్ళం మొదట్లో. కొన్ని సార్లు మా ఆఫీసులో నాకింద పనిచేసే వాళ్ళు ఒకసారి మా ఇంట్లో అంట్లుతోమే పనిమనిషి—మేము క్రిందికి వెళ్ళినప్పుడు వాళ్ళని బాల్కనీలో చూసేసరికి అభిమానం అడ్డు తగిలి, చూస్తే బాల్కనీలోనే కూర్చుని సినిమా చూడాలన్న నిర్ణయం తీసుకున్నాం. మనిషి బుద్ధిలో ఈ వెధవ తెగులు ఏ ఇజం అంటారో నాకు తెలియదు.

'దీపాలి'లో ఏమి సినిమా వచ్చిందో నాకు తెలియదు. పిల్లలిద్దరికీ తెలుసనుకుంటాను. చేటంత మొహాలు చేసుకుని ఆనందంగా అక్కణ్ణించి వెళ్ళిపోయారు.

"టికెట్లు కొనడానికి డబ్బు?"

"బీరువాలో దాచారుకదా ఏభై? అందులో నుంచి తీసి ఇచ్చాను."

"అసలే నెలాఖరు రోజులు. ఈ సినిమా చూడకపోతే ఏం పోయిందీ?" కొంచెం సంకటంగా అన్నాను.

"క్రితం నెల ఎవడో గొప్ప పాటగాడి గాన కచ్చేరికి పాతిక రూపాయలు తగలబెట్టి విని వచ్చాను. అంతక్రితం నెల ఎవరో గొప్ప నర్తకి భరత నాట్యం ముందు కుర్చీలో కూర్చుని చూడ్డంకోసం ముప్ఫయి రూపాయలు ఖర్చించారు. అప్పుడు అడగడానికి లేదు."

"జబర్దస్తీగా ఏవో సంక్షేమ కార్యక్రమాల కింద అంటగట్టారు కాని, నేను నిజంగా వెళ్ళగలిగే వెళ్ళానా? సరేలే, దరిద్రం ఎప్పుడూ ఉన్నదే కాని, రేపు హాయిగా అందరమూ సినిమాకి పోయి వద్దాం" అన్నాను. సెలవు రోజు ముందు

రాత్రి నా ఆవిడ మూడ్‌ని చెడగొట్టే మూర్ఖుణ్ణి కాను నేను.

ఆ మర్నాడు హడావిడి అంతా ఇంతా కాదు. బస్ స్టాండుకి వెళ్ళే సమయానికి చిన్నగా చినుకు పట్టుకుంది. కొంచెం సేపు ఆగాం, ఆగుతుందేమోనని. నిజంగానే ఆగింది. నేను పని చెప్పిన వెంటనే నా ఆఫీసు జవాను ఏ రోజైనా పనిచేస్తే నాకెంతో ఆనందంగా ఉంటుంది. నేను అనుకున్నట్లుగానే నిజంగా వర్షం ఆగినందుకు చాలా సంతోషించాం. కాని, బస్ స్టాండుకి వెళ్ళేసరికి వెళ్ళవలసిన బస్సు వెళ్ళిపోయింది. సమయానికి వచ్చి వెళ్ళిన బస్‌ని తిట్టుకుంటూ, అయిదు రూపాయలు ఖర్చుచేసి ఆటో రిక్షాలో సినిమా హాలు చేరుకున్నాము.

ఇంతా చెప్పి చూసిన సినిమా గురించి నాలుగు ముక్కలు చెప్పకపోతే న్యాయంగా ఉండదు. క్రూర హింసలూ, కత్తి యుద్ధాలూ, ముష్టి యుద్ధాలూ చిన్నప్పుడు సినిమాల్లో చూసినప్పుడు ఎగిరి గంతేసేవాణ్ణి. కరాటే దెబ్బలూ, జూడో పట్లూ చూసి పిల్లలు సంబరపడిపోయారు. వయసుతో వచ్చిన పక్వత అడ్డు రావడంతో నేను నోరు మూసుకుని కూర్చున్నాను.


గులాబీ రంగు కోటు, బొడకాలు పాటు— సారీ! బెల్‌బాటం పాంటు తొడుక్కున్న హీరో ఒంటిమీద హంగులన్నీ అంటుకుపోయిన జీన్సూ, బ్లౌజులతో కోకపీసు కొబ్బరి తోటల్లో ద్వంద్వార్థాల పాటలు పాడుకుంటున్నప్పుడూ, పడక గదిలో మంచంమీద పడి దొర్లుతున్నప్పుడూ నేను తీసుకున్న నిర్ణయం ఏమిటంటే, ఎదిగిన పిల్లలతో ఇటువంటి సినిమాలు ఎన్నడూ చూడకూడదని! ఎవరి దారిని వాళ్ళు సినిమా చూసి వస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు.

ఆరు వందలు తెచ్చుకునే హీరో అందమైన సోఫాలో కూర్చుని ఏదో ఫారిన్ మాగజైన్ చదువుతూంటే, అతగాడి గృహలక్ష్మి అన్ని హంగులూ ఉన్న వంటింట్లోంచి, అందమైన కప్పులతో కాఫీ ట్రే తీసుకొచ్చినప్పుడు—నా ఆవిడ మనోభావాలెలా ఉంటాయో ఊహించడానికి నేను ప్రయత్నించలేదు. ఆ ధైర్యం నాకు లేదు. ఆరువందల రూపాయల జీతంతో అన్ని హంగులూ అతగాడెలా అమర్చుకున్నాడో ఆ సినిమా తీసిన వాడికే తెలియాలి. లంచం తీసుకున్నాడా అంటే లేదు. ఎందుకంటే, హీరో ఎప్పుడూ మంచివాడే! కాని, కొంచెం లోతుగా ఆలోచిస్తే దీనికీ ఒక సమాధానం చెప్పుకోవచ్చు.

ఉన్నదున్నట్లు వాస్తవంగా చూపిస్తే, జీవితంతో విసుగెత్తినవాడికి సినిమా ఆనందం కలిగించ లేదు. నలభై అయిదేళ్ళ హీరో పద్దెనిమిదేళ్ళ కాలేజీ కుర్రాడుగా వేస్తూ, 'అమ్మా, నేను పరీక్షలు ఫైనల్ ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. పోలీసు ఇన్‌స్పెక్టరు ఉద్యోగం దొరికింది' అంటే వింతగా ఉంటుంది. ఆనందం కలిగిస్తుంది.

ముప్పై దాటిన తారలు పదహారేళ్ళ పిల్లలా నటిస్తూ, టెన్నిస్ షార్ట్సు, బొడ్డుమీద ముడి వేసుకున్న కాలర్ బ్లౌజుతో నాన్న వేషం వేసినవాడి మెడ చుట్టూ చేతులు వేసి, "డాడీ! స్నేహితులతో పిక్నిక్‌కి వెడుతున్నా. అయిదు వందలు కావాలి" అంటే "అయిదువందలేం ఖర్మ! వెయ్యి తీసుకు వెళ్ళు!" అనే సన్నివేశం మంచి ఆకర్షణగా ఉంటుంది. కోటిపల్లి గోదావరిలో స్నానం చేసి, తడి బట్టలతో హీరోయిన్ బెజవాడ కనకదుర్గ గుడి మెట్లెక్కుతున్నట్లు చూపిస్తే కొత్తగా ఉంటుంది. పాతలంటే రోతతో విసుగెత్తే మనిషికి వినోదం ఇలాగే కలుగుతుంది మరి.

అందుకనే నానుపాపిడి దగ్గర్నించి కాలి వేళ్ళ మట్టెలవరకు సర్వాలంకార భూషితురాలైన నర్తకి చేసే భరత నాట్యం చూసి ఆనందిస్తాను నేను. సినిమా తెరమీద విరబోసిన జుట్టు




దగ్గరినుంచి విడదీసిన కాళ్ళదాకా అంగాంగాల్నీ మలేరియా జ్వరం వచ్చినట్లు వణికించి పారేసే సుప్రసిద్ధ నర్తకి నాట్యం నలభై దాటిన నన్ను ఆకట్టుకుని, నరాల్ని కదిలించి పారేసిందని నిజం చెప్పకపోతే అబద్ధం చెప్పిన వాణ్ణవుతాను.

అక్కడక్కడ ఇలా ఇంటిల్లిపాదికీ ఒళ్ళు వేడెక్కించే ఒడిపట్లు ఉన్న ఆ సినిమా మొత్తం మీద పరమ చెత్తగా ఉంది. ఇంటర్వెల్‌లో జొన్న పేలాలు— సారీ! పాప్‌కార్న్, ఐస్‌క్రీమ్ కోన్లూ మరో పది రూపాయలకి కాళ్ళు వచ్చేటట్లు చేశాయి.

అంగుళం మందాన మెత్తటి ఎర్రటి తివాచీ మీద అడుగులు వేసుకుంటూ చల్లటి హాల్లోకి ప్రవేశించిన మేము ఆట అయిన తర్వాత దొడ్డి దారమ్మట మరుగుదొడ్ల వాసనకి ముక్కు మూసుకుంటూ రోడ్డుమీద పడ్డాం.

మా శ్రీమతికి సినిమా కూడా శ్రమకిందే లెక్క. అందుకని సిటీ బస్ మాట మరి తలపెట్టకుండా ఆటోలో ఇంటికి పోయాము. ఆ రాత్రి భోజనాలు చేస్తూంటే ఆర్కెమిడీస్ హఠాత్తుగా సూత్రం కనుక్కున్నవాడల్లే "అన్నట్లు నాకు పి. టి. షూస్ కొనలేదు" అన్నాడు మావాడు.

"హీరో బూటుకి లేసులు కొన్నాం ఆ డబ్బుతో" అన్నాను కొంచెం కోపంగా.

"నా స్కూల్ బాగ్!" అంది మా అమ్మాయి.

"చిన్న హీరోయిన్ స్కూల్‌బాగ్‌కి ఎమ్బ్రా బొత్తాం కొనిపెట్టాము. హీరో కోటు జేబులోకి ఒక రుమాలు, హీరోయిన్ జాకెట్‌మీద ఉన్న కుచ్చులూ—ఇలా ఎన్నో కొనిపెట్టాము వాళ్ళందరికీ. ఆ వెధవ సినిమా మీద తగలబెట్టిన డబ్బుతో మనకి కావలసినవి కొనుక్కుంటే ఎన్నో ఉండేది" అన్నాను. అలా అన్నందుకు నాకు చాలా సంతోషం వేసింది. నా మాటల్లోని కసి నా కుటుంబ సభ్యులకి మరకలా తగులుతుందనుకున్న నాకు ఆశాభంగమే అయింది. మా కుర్రవాడు నిదానంగా—"అలా అని ఎందుకనుకోవాలి, నాన్నగారూ? తెరమీద కనబడే ఆ నటులకీ, మన టిక్కెట్లు చింపే గేటుకీపరుకీ మధ్య ఎంతో మంది పని చేస్తున్నారు. వాళ్ళందరికీ మనం అన్నం పెడుతున్నామని ఎందుకనుకోకూడదూ" అని.

దీన్ని ఏ ఇజం అనాలో నాకు తెలియదు కాని, మా కుర్రవాడన్న మాటలకి నాకు సమాధానం దొరకలేదు.

నెల జీతం రాగానే మా పిల్లల అవసరాలు తీర్చగలిగినా, మళ్ళీ బోనస్ వచ్చేవరకు నేను కాని, శ్రీమతి కాని చూస్తూ చూస్తూ ఒక గుడ్డ ముక్క కొనుక్కోలేకపోయాము. ప్రసూతి వైరాగ్యం లాగే సినిమా వైరాగ్యం కూడా. నాలాంటివాడు వినోదంకోసం ఇటువంటి దరిద్రాల్ని కొనుక్కోక తప్పదు.

అయితే ఆ ఆరు నెలలలోనూ మరికొన్ని సినిమాలు చూసి, మేము కొనుక్కున్న దరిద్రాలు ఎన్నో ఉన్నాయి. ★